శ్రీ రామచంద్ర మిషన్ ®
సభ్యులకు మాత్రమే
ECHOES INDIA
అక్టోబర్ 2013
సంపుటి 6 సంచిక 6

## సెప్టెంబర్ 2013









## బెలారూస్, మిన్స్క్ ఆశ్రమ ప్రారంభోత్సవం

ఎప్పటిలాగే సెప్టెంబర్ ఒకటి ఆదివారంనాడు, మాస్టర్ గారు 'భగవద్గీత' పఠనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత తన ఆఫీస్ రూం లోకి వచ్చి, మణప్పాకంలో అలాగే ఒమేగా స్కూల్లో ఉన్న రష్యన్ అభ్యాసులు, పిల్లలు అందర్నీ లోపలకి పిలిచి, వీడియో లింక్ ద్వారా, మిన్స్క్ లోని అభ్యాసులనుద్దేశించి మాట్లాడారు. 'మా ప్రకారం ఇది రష్యన్లందరికీ చెందిన ఆశ్రమం, భవిష్యత్తులో మనకు మరిన్ని ఆశ్రమాలు వస్తాయి' అన్నారు. అదే సందర్భంలో, తనకు స్లావోనిక్ వాళ్ళతో ఎంతోకాలంగా పరిచయం ఉందని, బహుశ ఆ పరిచయం పూర్వజన్మల నుండీ ఉండి ఉండవచ్చునని అన్నారు. తనకు రష్యా వచ్చి వారందర్నీ చూడాలని కోరికగా ఉందని చెప్తూనే, 'ఎందుకంటే, నేను మళ్ళీ చెప్తున్నాను నాకు మిమ్మల్నందర్నీ చూడాలని ఎంతో ఆశగా ఉంది' అన్నారు. తన చుట్టూ ఉన్నవారిలో, ఒక అరడజను మంది రష్యన్ పిల్లలు ఒమేగాలో చదువుతున్నారని గ్రహించి, 'ఇంకా ఎక్కువ మంది (ఒమేగాకు) వస్తారని ఆశిస్తున్నాను' అన్నారు. తన ప్రసంగం అనంతరం, మాస్టర్ గారు సత్సంగ్ నిర్వహించి, ప్రసాదాన్ని నివేదించి అక్కడున్న రష్యన్ భాష మాట్లాడే అభ్యాసులందరికి అందించారు.

మాస్టర్ గారి ఆరోగ్యం మెరుగుపడుతుండటంతో, ఆయన ఒకరోజు వాకర్ సహాయంతో బయటకు వచ్చి కూర్చున్నారు. చాలా రోజుల తర్వాత ఆయన ఇలా నడుచుకుంటూ బయటకు వచ్చారు.

మిషన్ లోని 'హిస్టరీ' టీమ్ వారికి, మాస్టర్ గారు చాలా సమయాన్ని కేటాయిస్తున్నారు. ఆయన, 'మిషన్ హిస్టరీ గురించి నన్ను ప్రశ్నలడగండి, నాకు వీలైనంతవరకూ సమాధానాలు చెప్తాను' అన్నారు. కాబట్టి, ఆ టీమ్ వాళ్ళు రోజూ కాటేజికి వస్తున్నారు. మాస్టర్ గారు తొమ్మిదింటికల్లా తయారై సిట్టింగ్ ఇచ్చిన తర్వాత వారితో ప్రశ్నోత్తరాలు జరుపుతున్నారు. ఇది గంటకు పైగా నడుస్తోంది. మాస్టర్ గారు ఈ చర్చల్లో ఇంతలా పాల్గొనటం, చూడటానికి వీనులవిందుగా ఉంది. అప్రయత్నంగానే, ఆయన చుట్టు ఉన్నవారు కూడా అందులో పాల్గొంటున్నారు. ఆయన కనబరుస్తున్న స్ఫూర్తి, కుతూహలం మనం కూడా మన జీవితాలలో అవలంబించాలి. ఆయన ఏదీ కూడా ఇతరులను ప్రేరేపించటానికి చెయ్యరు. ఆయన, స్వయం ప్రేరణతో ముందుకెళ్తూంటారు, అది చూసి ఇతరులు ప్రేరణ పొందుతారు.







ఆదివారం, సో. కమలేష్ గారి సత్సంగ్, సో. సాంస్కృత్ కణ్ణన్ గారి గీతా పఠన కార్యక్రమం ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 'గీత'లోని రెండవ భాగమైన 'జ్ఞానయోగం' నడుస్తోంది. ఈ గీతా పఠన కార్యక్రమాన్ని చూడటానికీ, మాస్టర్ గారితో ఉండటానికీ వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఆదివారం తొమ్మిదింటికల్లా, కాటేజి ముందు చాలామంది క్యూ కడుతున్నారు.

బుధవారం సెప్టెంబర్ పదకొండున మాస్టర్ గారు, ఆశ్రమం వెనకాలే ఉన్న డా. నట్వర్ ఇంటికి గృహప్రవేశాన్ని చేసారు. తర్వాత ఇల్లంతా తిరిగి, అక్కడికొచ్చిన సుమారు నాలుగొందలమంది అభ్యాసులకు సిట్టింగ్ ఇచ్చారు. అది, దివ్య కృపతో నిండిన ఒక మహత్తర సందర్భం. మధ్యాహ్నం ఆలస్యంగా కాటేజీకి వచ్చినప్పటికీ, తన కాటేజీలో ఉన్న వారందరికీ సాయంత్రం మళ్ళీ సత్సంగం నిర్వహించారు.

గురువారం సెప్టెంబర్ పన్నెండున మాధురి పుట్టినరోజు. ఆమె మోకాలికేదో ఆపరేషన్ జరగటంతో, మాస్టర్ గారే ఆమెను చూడటానికీ, ఇతర కుటుంబ సభ్యులతో గడపటానికీ 'గాయత్రి' కి వెళ్ళారు. హాల్లో కూర్చుని అందరితో మాట్లాడుతూ, 'నా మనవరాలి పుట్టినరోజున ఇక్కడుండటానికి, అందరికంటే నేనే సంతోషిస్తున్నాను' అన్నారు.

## ఓనం పండగ ఉత్సవాలు

సోమవారం సెప్టెంబర్ పదహారు ఓనం పండగ. సుమారు మూడొందల మంది అభ్యాసులు కేరళ నుండి వచ్చారు. ఆయన కాటేజి ముందు ఉదయాన్నే పూలతో అలంకరించిన ముగ్గును మాస్టర్ గారు చూసారు. అందర్నీ 'హాపీ ఓనం' అని పలకరించి లోపలకు వెళ్ళారు. ఆ తర్వాత తొమ్మిదిగంటల సత్సంగానికి డార్మెట్రి 'ఏ' కు వచ్చి, ఒక ప్రసంగాన్ని ఇచ్చారు. మనుషుల నమ్మకాల గురించి, ఆచారాలగురించి మాట్లాడుతూ, హిందు, క్రిష్టియన్, ముస్లింలంటూ ఏమీ లేవనీ అందరూ మనుషులేనని అన్నారు. ప్రేమే అన్నింటికన్నా ముఖ్యమైనదని, అదే ఈ నమ్మకాలనూ, ఆచారాలనూ అధిగమించేలా చేస్తుందని అన్నారు. ప్రతి అభ్యాసి మిషన్ యొక్క ప్రతినిధి అనీ, అభ్యాసి ప్రశిక్షకుడు అనే తేడా ఏమి లేదని, అందరూ మిషన్ యొక్క ఉన్నతికోసం పాటుపడాలని ఆయన చెప్పారు. మధ్యాహ్నం కిచెన్ లో ప్రత్యేకంగా ఓనం విందు తయారుచేయబడింది, దాన్ని మాస్టర్ గారి కోసం కాటేజిలోకి కూడా పంపించారు.

◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆

తన ఆరోగ్యం బాగాలేదు కాబట్టి కాటేజిలోని రిపేరు పనులు వాయిదా వేసి, అక్కడే ఉండమని డాక్టర్లు చెప్పినా వినకుండా, మాస్టర్ గారు పద్దెనిమిదవ తారీకున గార్డెన్ ఆఫ్ హార్ట్స్ లోని, సో. సత్బీర్ ఇంటికి వెళ్ళారు. పనులు అనుకున్న ప్రకారం అయిపోవాలని ఆయన పట్టుబట్టారు. తనకు ఎంత ఇబ్బందైనా, ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత, దాన్ని తప్పక పాటిస్తారు. ఇలాంటి వాట్లో ఆయన్ని ఒప్పించటం చాలా కష్టం.

సత్బీర్ ఇంట్లో ఉన్న మొదటి రెండు రోజుల్లో, మాస్టర్ గారు ఉదయాన్నే సత్సంగ్ ను నిర్వహించేవారు. కానీ అభ్యాసులు మెడిటేషన్ హాలుకు వెళ్ళకుండా, అక్కడకు వస్తున్నారని గమనించి, ఎక్కడ సత్సంగానికి వెళ్ళినా, అదే ప్రాణాహుతి ప్రసారం జరుగుతుందని చెప్పి, అందర్నీ ఆశ్రమానికి వెళ్ళమన్నారు.

శనివారం సెప్టెంబర్ ఇరవై ఒకటిన మాస్టర్ గారు గాయత్రి కివెళ్ళారు. ఎంతో ఉత్సాహంగా కనిపించారు. ఇంట్లో వారందరితో మాట్లాడి, తిన్నగా డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళారు. బ్రేక్ ఫాస్ట్ అనంతరం తన ఆఫీస్ లోకి వెళ్ళి, కొంతసేపు పనిచేసుకుని, తన కంప్యూటరులో కొన్ని ఇంటర్వ్యూలను చూసారు. తర్వాత కొంతమంది అభ్యాసుల్ని కలిసి, అందరికీ సిట్టింగ్ ఇచ్చారు. మాస్టర్ గారికి అమెరికా నుండి కొత్త వీల్ చయిర్ వచ్చింది. అందులో కావల్సిన విధంగా పొజిషన్ మార్చుకోటానికి సౌకర్యం ఉంది. మాస్టర్ గారు దాన్ని ఉత్సాహంగా పరీక్షించారు.

మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత ఆయన హాల్లో గుమిగూడిన యూరోప్ అభ్యాసులను కలిసారు. అప్పుడు తనకు ఊపిరి అందటానికి ఇబ్బందిగా ఉందని చెప్పటంతో, డెన్మార్క్ నుండి వచ్చిన ఒక సోదరి ఒక చిట్కా చెప్పింది. అది మంత్రంలా పనిచేసింది. అయిదు నిమిషాల్లో ఆయన ఊపిరి సర్దుకుంది. సాయంత్రం మాస్టర్ గారు, ఆశ్రమంలో అందరికీ, తాను గాయత్రికి విశ్రాంతి తీసుకోటానికి వచ్చానని చెప్పమని చెప్పారు.





ఆదివారం సెప్టెంబర్ ఇరవై రెండున మాస్టర్ గారు,





గాయత్రిలో సత్సంగ్ నిర్వహించి, హాల్లో కొన్ని పెళ్ళిళ్ళు చేసి కొత్త దంపతుల్ని ఆశీర్వదించారు.

తర్వాత రెండురోజులు ఆయన, చెన్నైకు పడమరలోనున్న తిరువల్లూరులో, ఆశ్రమం కోసం స్థలం కొనటంలో నిమగ్నమై ఉన్నారు. ఆ స్థలం అమ్మిన వారి కుటుంబ సభ్యులందరూ గాయత్రికి వచ్చారు. మాస్టర్ గారు ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా కలిసి, అందరూ భోజనం చేసేలా చూసారు. స్థలం తాలూకు ఎగ్రిమెంటు, సేల్ డీడ్ కాగితాల్లో సుమారు మూడొందల సంతకాలు ఆయన పెట్టాల్సి వచ్చింది. కానీ ఆయన చిరునవ్వుతో, రెండురోజులూ రాత్రి పొద్దుపోయేదాకా కూర్చుని పని పూర్తి చేసారు. పనిచేస్తున్నంత సేపూ ఎంతో ఆనందంగా చేసారు. చేసే పని ఆనందంగా చేస్తే కష్టమనిపించదని మనకు నేర్పిస్తున్నారు.

శనివారం సెప్టెంబర్ ఇరవైఎనిమిదికల్లా, ఆయన తిరిగి ఆశ్రమానికి వచ్చేసారు. 'ఫ్రమ్ ఇగ్నొరెన్స్ టు నొయింగ్ టు అన్ నొయింగ్'(అజ్ఞానం నుండి జ్ఞానానికి, జ్ఞానం నుండి ఎరుకలేని తనానికి) అనే శీర్షికతో నవంబర్లో ఒక యూరోపియన్ సెమినార్ ను నిర్వహించటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మాస్టర్ గారు దీనిపై చాలా దృష్టి పెడుతున్నారు. ఒక సందర్భంలో ఆయన సంకల్పం గురించి, ఆలోచన గురించి మాట్లాడుతూ, ఔడే సెపేరే'(ఆలోచించే ధైర్యం చెయ్యి) 'కానీ ఆలోచించిన తర్వాత, ఆచరించటానికి సంకల్పం కావాలి. సంకల్ప శక్తిని ఉపయోగించిన కొద్దీ, చాయిస్ (ఎంపిక చేసుకోవాల్సిన) అవసరం తగ్గుతుంది. దానివల్ల జీవితం సరళమౌతుంది. కాబట్టి సంకల్ప శక్తిని వినియోగిస్తే, సరళంగా ప్రకృతితో సారూప్యం చెందేలా జీవించడం సాధ్యమే, అలా కాకపోతే సరళంగా జీవించడం సులభం కాదు' అని చెప్పారు.

## తిరువల్లూరు పర్యటన

గత కొన్ని రోజులుగా, చెన్నైకు నలభైఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువల్లూరులో నూటపదమూడు ఎకరాల స్థలాన్ని SMSF పేరు మీద రిజిస్టర్ చేయటం జరిగింది. మాస్టర్ గారు ఆ స్థలాన్ని చూడాలనుకున్నారు. సో. వినయ్ కృష్ణ ఆధ్వర్యంలో రాత్రికిరాత్రే వాలంటీర్లు అక్కడ ధ్యానానికో షామియానాను, మాస్టర్ గారికో టెంటును, అభ్యాసులకు పోర్టబుల్ టాయిలెట్లనూ అమర్చారు. చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాలనుండి, సుమారు మూడొందల మంది అభ్యాసులు అక్కడకు వచ్చారు.

మాస్టర్ గారు సెప్టెంబర్ ఇరవై ఎనిమిదిన, ప్రత్యేకంగా తనకోసం సీటు అమర్చిన మెర్సిడీస్ వానులో, ఉదయం ఎనిమిదన్నర ప్రాంతానికి తిరువల్లూరు చేరుకున్నారు. ముందుగా ప్రసాదాన్ని నివేదించి, ధ్యానమందిరానికి వెళ్ళారు. సుమారు నలభై అయిదు నిమిషాలసేపు సిట్టింగ్ ఇచ్చారు. తర్వాత ఆ ప్రదేశాన్ని ఏ విధంగా ఉపయోగించదలిచారో అనే దాని పై ఆలోచన చేసారు – ఒక ఆరోగ్య కేంద్రం, ధ్యానమందిరం, వ్యవసాయం, పాడి పరిశ్రమ(డైరి ఫార్మింగ్) మొదలైనవి చేసే ఆలోచనలో ఉన్నారు. కానీ ముఖ్యోద్దేశం మాత్రం ధ్యానమే, అని ఆయన అన్నారు. కొత్తగా మిషన్ లో చేరిన తిరువల్లూరు కలెక్టర్ సో. వీరరాఘవ రావు, జిల్లా ప్రభుత్వం నుండి పూర్తి సహాయం అందుతుందని హామీ ఇచ్చారు. అక్కడ స్థలాన్ని అమ్మిన సుమారు ముప్పైమందిని మాస్టర్ గారు కలిసి, వారికి ప్రసాదన్ని పంచి, వారితో ఫొటో దిగారు. అభ్యాసులు చాక్లెట్ కేక్ ను తీసుకోస్తే మాస్టర్ గారు దాన్ని కోసి అందరికీ పంచారు. ఆయన విశ్రమించటానికి వసతి కల్పించినప్పటికీ, విశ్రమించలేదు. తన వీల్ చైర్లోనే కూర్చుని అల్పాహారం చేసారు. ఈ మధ్యకాలం వరకూ ఆ స్థలంలో, బియ్యం, అరటి, కొబ్బరి సాగులో ఉన్నాయి కాబట్టి, ప్రదేశమంతా పచ్చదనంతో నిండి ఉంది. స్థలం నిండా చాలా బావులూ, బోర్లు ఉన్నాయి. ఉన్న కొద్ది పాటి రోడ్లమీద, వీలైనంత దూరం వెళ్ళి స్థలాన్ని వీక్షించిన తర్వాత, మాస్టర్ గారు తిరిగి చెన్నైకి ప్రయాణమయ్యారు.

ఇరవై తొమ్మిదవ తారీకు గీతా పఠన కార్యక్రమం తర్వాత, మాస్టర్ గారు కొద్ది సేపు మాట్లాడారు. 'ఇప్పటిదాకా మనం గీతా పఠన కార్యక్రమాలు చాలా విన్నాము, సో. సంస్కృత్ కణ్ణన్ ఎంతో విపులంగా శ్లోకాలకు అర్థం చెప్పారు, కాబట్టి ఇక వాటిని జీర్ణం చేసుకోవాల్సిన సమయం వచ్చింది. కాబట్టి వచ్చే రెండు ఆదివారాలు, వీటిపై ప్రశ్నోత్తరాలు ఉంటాయి' అని చెప్పారు.

## అక్టోబర్ 2013

### చైనా అభ్యాసుల సెమినార్

మంగళవారము, అక్టోబర్ 1 : చైనా మరియు ఇతర దేశములలో నివశిస్తున్న చైనా దేశపు అభ్యాసులు దాదాపు 110 మంది సమావేశములో పాల్గొనడానికి మణపాక్కం చేరుకొన్నారు. గురువర్యులు ఈ సమావేశము గురించి ఎదురు చూస్తూ ఉన్నారు. ఉదయం 8:30 మాస్టర్ కాటేజ్ నందు వచ్చియున్న అభ్యాసులను సంభోదించడానికి, తన గదిలోనుండి బయటకు వచ్చేముందు వారు కొన్ని చైనా పదాలను త్వరత్వరగా నేర్చుకొన్నారు. తన గదిలోనుండి బయటకు వస్తూనే

మాస్టర్ చైనా భాషలో మాట్లాడడంతో, బిగ్గరగా కరతాళధ్వనులు చేయడమైనది. మాస్టర్ చైనా భాషను నేర్చుకోనందులకు పశ్చాత్తాపపడి, తాను ఇప్పుడు చైనా దేశమునకు ప్రయాణించడానికి చాలా ముదుసలినయ్యానని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరము చైనా అభ్యాసులు ఎక్కువ సంఖ్యలో చెన్నై రావాలని ఆకాంక్షించారు. గాంగ్టాక్ ఆశ్రమము







( సిక్కిం, భారతదేశం) గురించి మాట్లాడుతూ, రిట్రీట్‌కు అది మంచి ప్రదేశమని, అభ్యాసులు సదుపాయమును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరువాత మాస్టర్ సత్సంగమును నిర్వహించారు. తదనంతరము అభ్యాసులు, 'ఎ' డార్మెంటరీలో జరుగుతున్న సమావేశమునకు హాజరైనారు.

తరువాతి రోజు, సోదరి గీతూ గారి అపార్ట్మెంట్ గృహప్రవేశం చేయడానికి, మాస్టర్ వీల్ చెయిర్‌లో బయలుదేరి వెళ్ళారు. సదస్సులో పాల్గొన్న అభ్యాసులు కూడా ఆహ్వానించబడినారు. మాస్టర్ ఆ రోజు సాయంత్రం, కాటేజ్ కి తిరిగివచ్చారు. మాస్టర్ తన ద్విచక్ర కుర్చీ వాహనంలో తరచుగా తిరుగుతున్నందువల్ల ఆయన కాళ్ళలో బొబ్బలు ఏర్పడినవి. అవి పగిలి గురువర్యుల కాళ్ళలో చాలా నొప్పిని కలుగచేసినవి. చికిత్స నిమిత్తం వైద్యులు కొంత వరకు చర్మమును తొలగించవలసివచ్చింది. మరియు ఇది తగ్గేవరకు గురువర్యులు తన కాళ్ళను పైనే ఉంచవలసి వచ్చింది. ఉన్న ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న గురువర్యులకు, ఈ క్రొత్త సమస్య తోడవ్వడం, చాలా విచారమును కలుగజేసినది.

సోదరులు P.R. కృష్ణ మరియు ఇతర అభ్యాసి సోదరులు కలసి, అక్టోబర్ 4వ తారీఖున తిరువళ్ళూర్ స్థలమును పరిశీలించి, ప్రాధమిక ప్రణాళిక తో తిరిగి రావడానికి వెళ్ళిరి. ప్రస్తుతము తాను ముఖ్యముగా వ్యవసాయముపై దృష్టి కేంద్రీకరించదలచినట్లూ, సోదరులు కృష్ణ ఈ స్థలమునకు సంబంధించిన మిగిలిన వ్యవహారములు నిర్వహించబోవునట్లు మాస్టర్ చెప్పారు.

సోదరులు P.R. కృష్ణ మరియు ఇతర అభ్యాసి సోదరులు కలసి, అక్టోబర్ 4వ తారీఖున తిరువళ్ళూర్ స్థలమును పరిశీలించి, ప్రాధమిక ప్రణాళిక తో తిరిగి రావడానికి వెళ్ళిరి. ప్రస్తుతము తాను ముఖ్యముగా వ్యవసాయముపై దృష్టి కేంద్రీకరించదలచినట్లూ, సోదరులు కృష్ణ ఈ స్థలమునకు సంబంధించిన మిగిలిన వ్యవహారములు నిర్వహించబోవునట్లు మాస్టర్ చెప్పారు.

సదస్సులో పాల్గొన్న అభ్యాసులను, ఆదివారం ఉదయం మాస్టర్ కలుసుకోవాలనుకొన్నప్పటికీ, ఆయన ఆరోగ్యం బాగుండకపోవడంతో, తన కాటేజ్ నుండి బయటకు రాలేకపోయినారు. కానీ, ఆ రోజు వెళ్ళిపోతున్న సుమారు 20 మంది అభ్యాసులను గురువర్యులు ఓపికతో కలుసుకొన్నారు. డార్మెంటరి 'ఎ' లో, సోదరులు కమలేష్ పటేల్ గారు సత్సంగమును నిర్వహించి, మిగిలిన అభ్యాసులను ఉద్దేశించి ప్రసంగించినారు.

ఆదివారం, గురువర్యుల ఆరోగ్యం బాగుండకపోవడంతో, ధ్యాన మందిరంలో సోదరులు కమలేష్ పటేల్ గారిని, మాస్టర్ కాటేజ్ లో సెమినార్‌లో పాల్గొన్న అభ్యాసులకు సోదరులు పి.ఆర్. కృష్ణ గారిని, సత్సంగం నిర్వహించమని చెప్పారు. సత్సంగం అనంతరం, అభ్యాసీ సమూహంతో కొంత సమయం గడపడానికి, గురువర్యులు బయటికి వచ్చినారు. అక్కడి వాతావరణం ఆయన ప్రేమతో నిండినది, చాలామంది అభ్యాసులు కన్నీటి పర్యంతమయ్యారు. అభ్యాసుల హృదయములు గురువర్యులచే గాఢంగా స్పృశింపబడ్డాయి.

అక్కడ సమావేశమైన ప్రతీ ఒక్కరికీ ఇవ్వడానికి, వంటగది జట్టును మిఠాయిలు మరియు కుడుములు తయారుచెయ్యమని గురువర్యులు కోరారు. చైనా మరియు వియాత్నం దేశములనుండి వచ్చిన



అభ్యాసులచే ఒక చిన్న సాంస్కృతిక కార్యక్రమము నిర్వహించబడినది. గురువర్యులు తన సర్వస్వమును, ఈ సెషన్ లో ఇచ్చినట్లుగా ప్రతీ ఒక్కరు అనుభూతి చెందినారు. తన అనారోగ్యమును కూడా లెక్కచేయకుండా, ఆ రోజు వెళ్ళిపోతున్న అభ్యాసులతో గురువర్యులు సమయమును గడిపినారు.


చైనా భాషను గురించి మాట్లాడుతూ, "ఒక్కసారి తగిన మానసిక స్థితి లోనికి వచ్చిన తర్వాత మీరు ఏదైనా నేర్చుకోవచ్చును. నేను చైనా భాషను నేర్చుకొంటున్నాను. ఆంగ్ల భాషలో 52 టోన్స్ ఉండగా, చైనా భాషలో నాలుగే ఉన్నాయి. చైనా భాష మృదువైనదీ మరియు అర్థవంతమైనది. ఉదాహరణకు, చైనా భాషలో 'హ్యాపి' ని 2 అక్షరములతో వ్రాస్తారు, దాని అసలైన అర్థం "నీ హృదయమును తెరువు" అని మాస్టర్ చెప్పారు.

చైనా సదస్సునకు, అక్టోబర్ 7వ తారీఖు ఆఖరు. సదస్సులో పాల్గొన్న అభ్యాసులకు గురువర్యులు సుమారు 45 నిమిషముల సేపు సత్సంగం నిర్వహించినారు. సత్సంగం అనంతరం, మాస్టర్ అలసిపోయినప్పటికీ, కొంతమంది అభ్యాసులను కలసి, పలుకరించి, విశ్రాంతి తీసుకోవడానికి వెళ్ళినారు. ఆ రోజు సాయంత్రం, కన్హా ప్రోజెక్ట్ పై పని చేస్తున్న అభ్యాసులు వచ్చారు, మాస్టర్ వారితో సమావేశమై, వారందరికీ సత్సంగము నిర్వహించారు.

“ ప్రతి ఒక్కరూ జీవిస్తారు, కానీ మనం జీవన సారాన్ని ఆ జీవితంలో వెతకాలి, చిట్టచివరకు ఆ జీవితం దాని సారంలో సంపూర్ణంగా లీనమైపోతుంది (లయమైపోతుంది)”

– శ్రీ రామ చంద్రుని సంపూర్ణ రచనలు,

సంపుటి 3, పుట 147



## సోదరులు కమలేష్ పటేల్ గారి గుజరాత్ పర్యటన

సెప్టెంబర్ 11వ తారీఖున, సోదరులు కమలేష్ పటేల్ గారు అహ్మదాబాద్ చేరుకొన్నారు. ఇది వారి వ్యక్తిగతమైన చిన్న ప్రయాణమని తెలియజేసినప్పటికీ, ఆయన తన ఈ పర్యటనలో, గుజరాత్ రాష్ట్రములో పలు కాంతి కేంద్రాలను సందర్శించారు.

15వ తారీఖున, అహ్మదాబాద్ అద-లజ్ ఆశ్రమము వద్ద సుమారు 900 మంది అభ్యాసులకు సత్సంగము నిర్వహించి, క్రమ సాధన యొక్క ప్రావముఖ్యతను నొక్కి వక్కాణిస్తూ ప్రసంగించారు. మనము మన మానసిక స్థితిని మరింత శుద్ధమైనదిగా తీర్చిదిద్దుకోవాలనీ, మరియు దేనికోసమైతే ధ్యానం చేస్తున్నామో దాని పట్ల సున్నితత్వమును పెంపొందించుకోవాలనీ వివరించారు. అహ్మదాబాదులో ఆయన, "ఎసోటెరిక్ చిహ్న పధకము" ను పరిచయము చేసినారు. ఈ పధకము పరిమిత సంఖ్యలో మాత్రమే లభ్యము. ఆయన వివిధ సెంటర్ల నుండి వచ్చిన అభ్యాసీలను కలిశారు.

15వ తారీఖున, ఆయన కమల్పూర్ ను సందర్శించి, మంగళవారం భావనగర్ కు బయలుదేరినారు. మాస్టర్‌తో ఆయన పంచుకొన్న అతి ముఖ్యమైన సంఘటనను అడుగగా, ఆయనను తన తరువాతి ప్రతినిధి గా గురువర్యులు ప్రకటించడమని సమాధానమిచ్చారు. తరువాత వడోదర, సూరత్‌లకు ప్రయాణమయ్యారు.

సూరత్ లో ప్రశ్నోత్తర కార్యక్రమములో ఆయన సాధన గురించి చాలా విషయాలను వివరించారు. సూరత్ కాంతికేంద్రమునకు ధ్యానమందిరవను తయారుచేసి , విరాళముగా ఇస్తానన్న ఒక అభ్యాసి సోదరుని విన్నపమును ఆయన అనుమతించిరి. తరువాత ఆయన నవసారి కాంతికేంద్రమునకు , అక్కడ నుండి, వల్సాద్ కు తన ప్రయాణం ను కొనసాగించారు. అక్కడి వారిని కలుసుకొని, సత్సంగం నిర్వహించి, ఆ రోజు రాత్రికి వడోదర తిరిగివచ్చారు.

గుజరాత్ రాష్ట్రం నుండి సుమారు 1000 అభ్యాసులు, 21 వ తారీఖున , వడోదర ఆశ్రమానికి వచ్చారు. ఆదివారం సత్సంగమనంతరం, ఆయన "మన సాధనతో అనుసంధానమైన సున్నిత వైజ్ఞానిక శాస్త్రం" – అంశముపై ప్రసంగించినారు. తరువాతి రోజు ఆయన ఆనంద్ ను సందర్శించి, 25వ తారీఖున అహ్మదాబాద్ చేరుకొన్నారు. GITP కార్యక్రమమును ప్రారంభించడానికు ఆయన అదలజ్ కాంతికేంద్రమును 27వ తారీఖున సందర్శించినారు. ఈ కార్యక్రమమునకు 75మంది అభ్యాసులు, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర మరియు మధ్య ప్రదేశ్ నుండి హాజరైనారు.

30వ తారీఖున, కడి, పలన్పూర్, మెహ్సన, కలోల్ మరియు ఉన్జ ల నుండి వచ్చిన సుమారు 125 మంది అభ్యాసులకు ఆయన సత్సంగం నిర్వహించారు. వీరిలో చాలామంది క్రొత్తగా సాధనను ప్రారంభించినవారు. జీవితంలో ఇటువంటి సున్నితమైన పద్ధతిని అవలంభించడం ముఖ్యమని సోదరులు కమలేష్ గారు వారికి వివరించినారు. అహ్మదాబాద్ కు బయలుదేరుటకు ముందు, ఆయన కలోల్ లో కొంత సమయమును గడిపినారు. అక్టోబర్ 2వ తారీఖున ఆయన తన గుజరాత్ ప్రయాణం ను ముగించుకొని, చెన్నై తిరిగి ప్రయాణమయ్యారు.







## ఆశ్రమ పర్యవేక్షణ కార్యక్రమము

దేశంలోని అన్ని ప్రాంతములనుండి వచ్చిన ఆశ్రమ్ మేనేజర్స్, ఆశ్రమ పర్యవేక్షకులౌదామనుకొంటున్న ఉత్సాహవంతులైన స్వయంసేవకులు, సెంటర్–ఇన్–చార్జ్ లు సుమారు 45 మంది, ఆగస్ట్ 20 నుండి 24 వరకు, మణపాక్కం లో జరిగిన 5 రోజుల కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమము ,గురువర్యులచే ఉత్తేజితం చేయబడినది. ఆశ్రమాలను క్రమబద్ధమైన, క్రమశిక్షణతో కూడిన పద్ధతిలో నిర్వహించడం చూడాలనుకొంటున్నానని మాస్టర్ పేర్కొన్నారు. "మన ఆశ్రమాల గురించి దూరదృష్టి కల్పించుకోవడం", "ఆశ్రమాలను మరింత సమర్ధవంతంగా ఉపయోగించుకోవడంపై ఆలోచనలు" , "ఆధ్యాత్మికాభిలాషుల సేవకు ఉపయోగపడేటట్లుగా ఆశ్రమాలను క్రమబద్ధీకరించడం", "ఆశ్రమాలను ఉద్ధరించడం " మరియు "ఆశ్రమ నిర్వహణలో, పరస్పరమైన నమ్మకము మరియు గౌరవములను పెంపొందించుకొనే సంస్కృతిని వృద్ధి చేయడం" వంటి రోజుకొక నేపధ్యము (అంశము) ఇవ్వబడినది. ఈ కార్యక్రమములో సత్సంగములు, భాషణలు, ప్రెజెంటేషన్స్, గురువర్యుల వీడియో రికార్డింగ్ లు, సమూహ చర్చలు మరియు ముఖ్యముగా మణపాక్కం ఆశ్రమమునందు గల 43 విభాగాల సందర్శనము మొదలగు అంశములు చోటుచేసుకొన్నాయి.

రెండవ రోజు కార్యక్రమములో సోదరులు కమలేష్ పటేల్ గారు, "ఆశ్రమములో ఫలవంతమైన కార్యక్రమములను ప్రోత్సహించడం, స్వాగతపూర్వకమైన, వెచ్చని వాతావరణమును సృష్టించుకోవడం పై మన శ్రద్ధ" అనే అంశములపై తన అభిప్రాయములను తెలియజేసినారు. తన ఆరోగ్య సమస్యతో అసౌకర్యముగా ఉన్నప్పటికీ, గురువర్యులు ఈ కార్యక్రమపు చివరి 2 రోజులు , ఈ కార్యక్రమములో పాల్గొన్న అభ్యాసులనుద్దేశించి ప్రసంగించిరి. కార్యక్రమము ముగింపు రోజున, సత్సంగం నిర్వహించిన తరువాత, గురువర్యులు మాట్లాడుతూ, ఆశ్రమ నిర్వహణ నిజంగా ప్రతీ అభ్యాసీ అంతః నిర్వహణతో మొదలవుతుందని, అందువలన మనం ప్రతీ ఒక్కరము, మన హృదయములోనే ఆశ్రమమును నిర్మించుకోవాలని నొక్కి వక్కాణించారు. ఆశ్రమ నిర్వహణ అంటే పూర్తిగా సహజమార్గ పద్ధతిలో జీవితమును జీవించడమేనని ఆయన అన్నారు.



## క్రొత్త కాంతి కేంద్రము – పచోరి, మధ్య ప్రదేశ్.

మధ్య ప్రదేశ్ లోని, రాజ్‌ఘడ్ తాలూకా లోని, పచోరి కాంతికేంద్రము మరియు చుట్టుప్రక్కల గ్రామములనుండి వచ్చిన సుమారు 150 మంది ఆధ్యాత్మికాభిలాషులకు అక్టోబర్ 2వ తారీఖున ఓపెన్‌హౌస్ కార్యక్రమము నిర్వహించబడినది. సోదరి రుచి శ్రీవాస్తవ గారి పరిచయాత్మక ప్రసంగ మనంతరము, సోదరులు ప్రభాకర దాస్ గారు, "ఆధ్యాత్మిక అవసరము","సహజమార్గపు గురుపరంపర", "సంస్థ అందిస్తున్న సేవలు" అనే అంశములపై ప్రసంగించిరి. సోదరి సంగీత దాస్ గారు, సాధనలోని వివిధ అంశములు, మరియు మన దైనందిన జీవితములో వాటి ప్రభావములపై ప్రసంగించిరి. అనధికార ముఖాముఖి చర్చల అనంతరము, 25 మంది, సాధనను ప్రారంభించడానికి సుముఖతను వ్యక్తపరిచిరి. వారికి వారి పాత్ర మరియు వారినుంచి ఆశించిన నిబద్ధత లను గూర్చి లోతుగా వివరించడం జరిగినది. వారిలో 10 మంది అప్పుడే ప్రారంభ సిట్టింగ్ తీసుకొనగా, మిగిలినవారు తరువాతి వారంలో తీసుకొన్నారు. ఆ విధంగా, మధ్య ప్రదేశ్ లోని ఈ ప్రాంతములో ఒక క్రొత్త కాంతికేంద్రము సహజముగా ఏర్పడినది.

## కొలకులూరు వద్ద ప్రాంతీయ ఆశ్రమము – ఆంధ్ర ప్రదేశ్

విజయవాడ, గుంటూరు, తెనాలి మరియు మంగళగిరి కేంద్రాలకు చెందిన అభ్యాసుల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడానికి, ఖాజీపేట, గుంటూరు వద్ద సుమారు 50 ఎకరముల భూమి, M.G. బ్రదర్స్ రియల్ ఎస్టేట్ వారు ఇచ్చారు. సుమారు 18.75 ఎకరముల స్థలము ఆశ్రమము కొరకు ఉద్దేశింపబడగా, మిగిలిన స్థలమును అభ్యాసుల కొరకు "శ్రీ పార్థ సారధి నగర్ రెసిడెన్షియల్ కాలనీ" గా నిర్ణయించిరి.

గురువర్యుల దీవెనలతో, జోనల్–ఇన్–చార్జ్, సోదరులు మధు కొత్తపల్లి గారిచే శంఖుస్థాపన ఫిబ్రవరి 2, 2012న జరిగింది. సెప్టెంబర్ 8, 2013 , ఉదయం 11:00 లకు పూజ్య గురువర్యులు , చెన్నై నుండి లైవ్ టెలికాస్ట్ ద్వారా, ఆశ్రమ ప్రారంభోత్సవము జరిపి, ఆశ్రమమును పూజ్య బాబూజీ మహారాజ్ గారి కి అంకితమిచ్చినారు. ఆశ్రమాలను ఉపయోగించుకోవాలని, అవి విద్యార్థులు లేని పాఠశాలలుగా ఉండరాదని, గురువర్యులు పేర్కొన్నారు. ఉత్సాహము నిండిన తీక్షణమైన హృదయములతో, అభ్యాసులు కొలకలూరు వద్ద ఉత్సవము జరుపుకొన్నారు. ఇప్పుడు ఇక్కడ క్రమ బద్ధమైన సాధారణంగా జరుపుకొనే సత్సంగములు, పూర్తి దిన కార్యక్రమములు జరుపబడుతున్నవి.

# యువజన కార్యక్రమాలు





## అహ్మద్ నగర్, మహరాష్ట్ర

అక్టోబర్ 6న సోదరీమణులు ఏర్పాటు చేసిన ఎంతో రుచికరమయిన భోజనం ముగించి 22 మంది యువకులు ఎఫర్ట్స్ నక్షత్రశాలకు చేరుకున్నరు. పరిచయ – నమోదు కార్యక్రమాలు ముగిశాక అందరూ ఆశ్రమ సాహిత్యం మీద Dumb Charades (మూగ సైగల ఆట) ఆడారు. ఈ ఆట మనసు లో కలిగే భావాలను మాటలు లేకుండా హృదయం తో వ్యక్తీకరించడం అనే ప్రక్రియకి సరయిన ఉదాహరణగా నిలిచింది. అనంతరం నక్షత్రశాల వారు నిర్వహించిన కార్యక్రమం ఎంతో విజ్ఞాన దాయకంగా ఉంది. మొత్తం మీద ఈ కార్యక్రమం అందరిలో సోదర భావం పెంపొందించింది.

## భిల్వారా, రాజస్థాన్

**ఆగష్టు** 25 ప్రతీ నెల నిర్వహించే విహార యాత్ర లో భాగంగా 12 మంది యువకులు, ఇద్దరు చిన్న పిల్లలు హరిణి, మహదేవ్ విహార యాత్ర లో పాల్గొన్నారు. వారు సహజ మార్గ సాధన ఎలా మొదలు పెట్టినది, తమ లక్ష్యం ఎమిటి అనే విషయాలు అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో తెలిసినది ఏమిటంటే, చాలా మంది సాధకులకు లక్ష్యం గురించిన సరయిన అవగాహన లేక పొవటం. ఆశ్రమ సాహిత్యం లో మన లక్ష్యాన్ని గురించిన అంశాలు అందరికీ చేదివి వినిపించారు. ఈ విషయం మీద మరింత అవగాహన అందరి లో పెరగడం కోసం, ప్రతి ఆదివారం సత్సంగం తరువాత ఒక 15 – 20 నిమిషాలు సమావేశం అయ్యి లక్ష్యం గురించి తమ తమ అనుభవాలను అందరితో పంచుకోవాలని నిర్ణయించారు.



## ఐక్యరాజ్యసమితి యువజన దినోత్సవం – వెబినార్

శ్రీ రామచంద్రా మిషన్ ఐక్యరాజ్య సమితి లోని ప్రభుత్వేతర సంస్థ గా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ విభాగం లో 12 **డిసెంబర్** 2005 న నమోదు కాబడింది. జాతి, కుల, మత, వర్ణాలకి అతీతంగా మానవాళిలో ప్రేమ సోదరభావం నింపడం దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

విశ్వ ప్రార్థన : మార్పుకు ప్రేమే ప్రేరణ అనే అంశం మీద 17 **ఆగష్టు** 2013 న నిర్వహించిన వెబినార్‌లో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలనుండి 4649 మంది పాల్గొన్నారు. సో॥ ఆండ్రీ బరెట్టో ( సావో పాలో, బ్రెజిల్ ) గారి సహజ మార్గ పరిచయ ఉపన్యాసం తో ఈ సదస్సు ప్రారంభమయ్యింది. అనంతరం పూజ్య గురుదేవులు యువతని ఉద్దేశించి చేసిన చిన్న ప్రసంగం వినిపించారు. పారిస్‌కి చేందిన సోదరి ఎక్తా బౌల్డరిక్ శ్రీ రామ చంద్రా మిషన్ – ఐక్యరాజ్యసమితి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ విభాగానికి సంబంధించిన వివరాలు తెలియ జేశారు. సో॥ రిషబ్ కొఠారి గారు తేజోమయ లోకపు సందేశాల (విస్పర్స్) నుండి పూజ్య బాబూజీ మహరాజ్ గారు **నవంబర్** 17, 1999 ఇచ్చిన సందేశాన్ని చదివారు. అనంతరం సదస్సు యొక్క ఉద్దేశ్యాన్ని అందరికి తెలియజేశారు.

సదస్సు అనంతరం సో॥ రిషబ్ కొఠారీ, సోదరి ఏక్తా గారు ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. యువకులు తమ అనుభవాలు, ఎదుర్కొంటున్న ప్రతిబంధకాలు తెలియజేయడానికి ఈ సదస్సు ఒక వేదిక గా నిలిచింది. మణపాక్కం ఆశ్రమం నుండి 200 LMOIS నుండి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సు చివరి అంశం విశ్వ ప్రార్థన అందరిని విశేషంగా ఆకట్టుకుంది. ప్రపంచం లోని వివిధ సాంప్రదాయాల వారు విశ్వ ప్రార్థనని మానవాళి లో ప్రేమతో కూడిన మార్పు తీసుకు రావడానికి గొప్ప సాధనంగా అభిప్రాయ పడ్డారు. సదస్సు తరువాత వివిధ ప్రాంతాల నుండి ప్రార్థన చేసిన వారు ఒక మంచి ప్రపంచాన్ని నిర్మించడానికి సహాయ సహకారాలు పొందిన అనుభూతి చెందారు.

## ప్రశిక్షకుల సమావేశాలు






### తిరుచ్చి: తమిళనాడు

సెప్టెంబర్ 21, 2013న జోన్ 2A ఇన్‌చార్జ్ సో॥ మురుగన్, భారత దేశం ఇన్‌చార్జ్ సో॥ రాజేష్ రాథోడ్ మరియు ఇతర ప్రశిక్షకులు ఈ సమావేశం లో పాల్గొన్నారు. ఉదయం 7:30 సత్సంగం తో సమావేశం ప్రారంభమయ్యింది. సత్సంగం తరువాత పూజ్య గురు దేవులు Deepening the Prefects కార్యక్రమం లో 23 Jan 2013 న "సిట్టింగ్‌లు ఎలా ఇవ్వాలి" అనే అంశం మీద చేసిన ప్రసంగాన్ని ప్రదర్శించారు. మీ కేంద్రం లో జరుగుతున్న కొన్ని మంచి విషయాలు, గత సంవత్సర కాలం లో మీరు పరిచయం చేసిన క్రొత్త కార్యక్రమాలు – అవి తీసుకువచ్చిన మార్పులు మీద ప్రశిక్షకుల మధ్య చర్చ జరిగింది. ఈ చర్చ వల్ల ప్రశిక్షకులకి ఒకరి నుండి ఒకరికి మంచి విషయాలు నేర్చుకునే అవకాశం కలిగింది. సో॥ మురుగన్ జోన్ 2A లో జరుగుతున్న వివిధ కార్యక్రమాలు గురించిన వివరాలు అందించారు. మధ్యాహ్నం ప్రశిక్షకుల మధ్య "అవకాశాలు – అవరోధాలు" అనే అంశం మీద చర్చ జరిగింది. పూజ్య గురు దేవులు "ఉన్నత ప్రశిక్షకులుగా ఎలా అవ్వాలి" అనే అంశం మీద చేసిన ప్రసంగాన్ని ప్రదర్శించారు. సాయంత్రం 6:00 గం॥ జరిగిన సత్సంగం తో సమావేశం ముగిసింది.

### లక్నో – ఉత్తర్ ప్రదేశ్

సెప్టెంబర్ 28 – 29 న జోన్ ప్రశిక్షకుల రెండు రోజుల సమావేశం సో॥ U.S. బాజ్‌పాయి (కార్యదర్శి) గారి ఆధ్వర్యం లో జరిగింది. సో॥ అశోక్ గార్గ్ గారు తమ స్వాగతోపన్యాసం లో సభ్యులందరు సహృదయముతో సమావేశంలో పాల్గొని లబ్ధి పొందాలని సూచించారు. సమగ్రమైన ప్రశిక్షకులుగా అవ్వడము, సిట్టింగ్‌లు ఎలా ఇవ్వాలి, క్రమశిక్షణ యొక్క అవసరము అనే అంశాల మీద పూజ్య గురు దేవులు చేసిన ప్రసంగాలు DVD ద్వారా ప్రదర్శించారు. సో॥ R.R.K.త్రివేది ప్రశిక్షకుని పాత్ర మీద ప్రసంగించారు. సో॥K.K.సక్సేనా ప్రిఫెక్ట్ గైడ్ నుండి కొన్ని అంశాలు వివరించారు. సో॥ఆశిష్ సింగ్ గారు తమ ప్రసంగం ద్వారా ప్రశిక్షకులకు క్రమశిక్షణ, అంకితభావం గల అభ్యాసులు గా అందరి లో ప్రేమ, సోదరభావం కలుగజేయాలని చైతన్య పరిచారు. సోదరి ప్రియదర్శిని గారు తిరుచ్చిలో జరిగిన "డీపెనింగ్ ప్రిఫెక్ట్స్ ఎక్స్‌పీరియన్స్" కార్యక్రమాన్ని గురించి వివరించారు. సో॥O.P.**గులియా** సో॥R.S.L. **శ్రీవత్సవ** గార్లు సెంటర్ల చరిత్ర మీద ఎలా పనిచేయాలో వివరించారు. సో॥ అశోక్ గార్గ్ గారు జోన్‌లో తమ పర్యటన వివరాలు తెలియజేశారు. సో॥U.S.బాజ్‌పాయి గారి ఉపన్యాసంలో అశోక్ గార్గ్ గారికి ధన్యవాదాలు తెలియజేసి సమావేశాన్ని ముగించారు. ప్రశిక్షకులందరు తమతమ ప్రాంతాలకి ఎంతో నిబద్ధత తో తిరిగి వెళ్ళారు.

---

### మంగుళూరు: కర్ణాటక

సెప్టెంబర్ 1, 2013న సో॥ మోహన్ దాస్ గారు "మన స్థితిని ఎలా పరిశీలించాలి" అనే అంశము మీద సదస్సు నిర్వహించారు. దిన చర్య వ్రాయడం ద్వారా అవగాహన, సున్నితత్వం ఎలా పెంపొందించుకో వచ్చో వివరించారు. సత్సంగము ముందు, తరువాత సాధకులు సమయం, స్థానం గురించిన అవగాహన, ధ్యానం లో అనుభవించిన లోతు, శాంతి వంటి అనుభవాలు తమ దినచర్యలో నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్మలీకరణ, అంతర్ దృష్టి పెంపొందించు కోవడానికి దినచర్య వ్రాయడం ఒక మంచి సాధనం అని వివరించారు. అనుభూతి, స్థితి రెండు వేర్వేరు అంశాలని వివరించారు. అభ్యాసీల మధ్య "తృష్ణను పెంపొందించడానికి సాధనోపాయాలు" అనే అంశం మీద చర్చ జరిగింది. అభ్యాసీలందరు మొదటి మూడు సిట్టింగ్‌లు ముందు, తరువాత తమ అనుభవాలు పంచుకున్నారు. సాధన పట్ల సరయిన వైఖరి అలవరచు కోవాలని, ముఖ్యంగా సాధన యాంత్రికంగా కాకుండా మనస్ఫూర్తిగా హృదయాన్ని లగ్నం చేసి సాధన కొనసాగించాలని సో॥ మోహన్ దాస్ గారు వివరించారు. పూజ్య గురుదేవులని వీలైనన్ని సార్లు కలవడం వల్ల మనలో ఆర్ద్రత పెరుగుతుంది అని వివరించారు.





## మనన కార్యక్రమం: తిప్టూర్ కర్ణాటక

సాధనీయ చైతన్య శిబిర కార్యక్రమం కన్నడ లో **సెప్టెంబర్** 14 – 15 తేదీలలో జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం – సాంప్రదాయాల పట్ల సరైన అవగాహన, సాధన లోని లోపాలని అతిక్రమించి సరైన అవగాహన కలిగించడం, ఆంతరంగిక వ్యక్తిత్వ వికాసం పట్ల దృష్టి సారించడం. ఈ కార్యక్రమం లో సుమారు 40 మంది అభ్యాసీలు పాల్గొన్నరు. కార్యక్రమం లో పాల్గొన్నవారందరూ ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉందని, సంస్థ పట్ల సరైన అవగాహన కలిగిందని తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమాన్ని సో॥ శ్రీనివాస, సో॥Dr. కృష్ణమూర్తి గారు నిర్వహించారు.

## తూముకుంట ఆశ్రమం – హైదరాబాద్

ప్రతి నెల మొదటి శనివారం జోనల్ ఆశ్రమంలో అందరూ కలిసే కార్యక్రవ ం జరుగుతుంది. అక్టోబర్ 5 నాటికి ఈ కార్యక్రమం మొదలు పెట్టి రెండు సంవత్సరాలు అయ్యింది. ఈ కార్యక్రమం లో ప్రధానంగా పూజ్య గురుదేవుల మీద చిత్రీకరించబడిన దృశ్య–శ్రవణ కార్యక్రమాలు చూడటం, సహజ మార్గం లోని వివిధ అంశాల మీద చర్చించుకోవడం, వ క్తలు చేసే ఉపన్యాసాలు, విస్పర్స్ నుండి సందేశాలు చదవడం వంటివి జరుగుతాయి. పూజ్య గురుదేవులని దర్శించిన వారు, క్రెస్ట్, రిట్రీట్ సెంటర్లకి వెళ్ళి వచ్చినవారు ఈ కార్యక్రమంలో తమ అనుభవాలని పంచుకుంటారు. ఈ కార్యక్రమం అభ్యాసీల మధ్య సంబంధ బాంధవ్యాలు పెంచడానికి బాగా ఉపయోగ పడుతున్నాయి. అభ్యాసీలు ఈ కార్యక్రమం లో ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారు.



## కుంబకోణం: తమిళనాడు

"మిషన్ సాహిత్యము నుండి నేర్చుకోవడము" అనే కార్యక్రమాన్ని సో॥మురుగన్ ప్రతిపాదించారు. ఆశ్రమ సాహిత్యం చదవడం మీద మక్కువ పెంచుకోవడం, కలిసికట్టుగా ఒక జట్టుగా పని చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమాన్ని మొదటగా తిరుచ్చిలో జులై 27న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22 కేంద్రాల నుండి సుమారు 60 మంది అభ్యాసీలు పాల్గొన్నారు. ఒక జోన్ని 14 ఉప మండలాలుగా, ఒక ఉప మండలంలో ఐదు నుండి ఆరు కేంద్రాలు ఒక సమన్వయకర్త ఉండేట్టుగా విభజించారు. ఐదవ ఉప కేంద్రంలో కుంబకోణం, కారైకల్, తిరువారూర్, నాగపట్టిణం, కుడవసల్ మరియు మైలాడుథుర్రై కేంద్రాలు ఉన్నయి. వారు తమ మొదటి సమావేశం సెప్టెంబర్ 8న కుంబకోణంలో నిర్వహించారు. 23 మంది అభ్యాసీలు సత్యోదయం పుస్తకాన్ని చదవడానికి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పుస్తక పఠనం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నామని అభిప్రాయపడ్డారు.

## ఆన్టాద్: మధ్యప్రదేశ్

సెప్టెంబర్ 8న సహజమార్గ సాధన మీద వివిధ అంశాలు మరియు, మన స్థితిని పరిశీలించడము మరియు నిలుపుకోవడము – సోదరులు రాజేష్, శైలేంద్ర, మరియు నీలేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్టాద్, దవన, థిక్రి మరియు బద్వాని కేంద్రాల నుండి సుమారు 40 మంది అభ్యాసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం మీద చర్చ జరిగింది. నేను ధ్యానం, నిర్మలీకరణ ఎలా చేసుకుంటున్నాను అనే అంశం మీద ఆత్మ పరిశీలన కార్యక్రమం జరిగింది, అనంతరం పూజ్య గురు దేవులు ఇచ్చిన వివరణతో అభ్యాసీలు తాము చేస్తున్న పొరపాట్లు సరిదిద్దుకోవడానికి దోహదపడింది. అనంతరం నిర్వాహకులు అంతర్గత స్థితి నిలుపుకోవడం మీద చిన్న సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా అభ్యాసీలందరినీ కొన్ని క్షణాలు తమ ప్రస్తుత స్థితిని గమనించమని, ఒక 15 నిమిషాలు ధ్యానం చేసిన తరువాత కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా తమ స్థితిని గమనించి దినచర్యలో వ్రాసుకోమని చెప్పారు. సున్నితత్వం, జాగరూకత వంటి విషయాల ప్రాముఖ్యత అందరూ గమనించారు.

## టూకీగా



### కోల్‌కత్తా

సెప్టెంబర్ 7వ తేదీనాడు లజ్పత్ బాలికా విద్యాలయం నుండి దాదాపు 58 మంది బాలికలు తమ నలుగురు ఉపాధ్యాయులతో బాటుగా వచ్చి కలకత్తాలోని బాబూజీ స్మారక ఆశ్రవాన్ని సందర్శించారు. వారందరికీ సమయ నిర్వహణ, మానవత్వం, కరుణ వంటి VBSE ప్రయోగాలు చూపించబడ్డాయి. ఆ టీచర్లు, విద్యార్థులు మిషన్‌తో మరిన్ని సార్లు కలిసి తెలుకోవాలని అన్నారు. కొందరు ఉపాధ్యాయులు సాధన మొదలుపెట్టాలన్న తమ ఇష్టాన్ని తెలిపారు.

### కోల్‌కత్తా

సెప్టెంబర్ 22 నాడు, పిల్లలను వయస్సు అనుసారం గుంపులుగా చేసి వారికి ప్రార్థన చెప్పమని, లేదా వ్రాయమని లేదా దశ నియమాలను నేర్చుకోమని చెప్పడం జరిగింది. పెద్ద పిల్లలు, ప్రేమ, క్రమశిక్షణ, ధ్యానం వంటి అంశాలపై చిన్న వ్యాసాలు వ్రాసారు. దాదాపు డెబ్బై మంది పిల్లలు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పిల్లలను, వారి తల్లి తండ్రులను ప్రార్థన, దశ నియమాలగురించి నేర్చుకోవాలని ఉత్సాహపరిచింది.



### వడోదర

సోదరులు బిట్టు భాయ్ చిల్డ్రన్ సెంటర్ వాలంటీర్‌లతో కలసి, నవరాత్రి పండుగ ఉత్సవాలలో భాగంగా అక్టోబర్ 13 నాడు ‘గర్బా’ నృత్యాన్ని నిర్వహించారు. సత్సంగ్ తరువాత రంగురంగుల ‘గర్బా’ దుస్తులలో నృత్యం చేస్తుండగా వారి తల్లి తండ్రులు, పెద్దలూ కూడా చేరి నృత్యం చేసారు. ఇది ఎంతో ఆనందదాయకంగా ఉండి, సంతోషానుభూతిని కలిగించింది.



### మొరాదాబాద్, ఉత్తర ప్రదేశ్

29 సెప్టెంబర్ నాడు డైరీ వ్రాయడంపై కార్యక్రమం నిర్వహించబడింది. నలుగురు అనుసంధానకర్తలు మూడు గుంపులుగా విభజింపబడ్డ ఇరవై ఎనిమిది మంది అభ్యాసీల కోసం ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇది పాల్గొన్నవారికందరికీ నచ్చింది; చాలామందికి, మన ఆధ్యాత్మిక స్థితి గురించి డైరీలో వ్రాసినప్పుడు, మాస్టర్‌గారికి అది ఎలా చేరుతుందన్న విషయాన్ని గురించి అనుభూతి చెందారు. వర్క్‌షాప్ మధ్యాహ్నం రెండున్నర వరకూ జరిగింది.




### ఇండోర్, మధ్యప్రదేశ్

ఆగస్ట్ 31వ తేదీనాడు, ఇండోర్ ఆశ్రమంలో అభ్యాసీలు అందరూ మాస్టర్‌గారితో సంధానం ఎలా పెంపొందించుకోవడం అన్న విషయం పై అంతఃశోధన చేసుకోవడానికి కలిసారు. ‘దివ్య సుధాదార’ పుస్తకం నుండి కొంత భాగం చదవబడింది. మాస్టర్‌ను మన ఆధ్యాత్మిక హృదయంగా చూస్తూ ఆయన్ను అంతర్లీనం చేసుకోవాల్సిన అవసరం గురించి ఆ అంశంలో చెప్పబడింది. అభ్యాసీలకు అంతర్ముఖులై వారు గ్రహించినదాన్ని డైరీలో వ్రాసుకొనే అవకాశం ఇవ్వబడింది.

### చిఖాలి, మహారాష్ట్ర

అరపై అయిదుమంది అభ్యాసీలకోసం ‘నిరంతర స్మరణ’ గురించి పూర్తిరోజు కార్యక్రమం అక్టోబర్ ఆరవ తేదీన నిర్వహించబడింది. అందరూ దీని పట్ల అవగాహనతో తయారై రావడం వల్ల చర్చ లాభదాయకంగా సాగింది. సెంటర్ ఇన్ చార్జ్ అయిన సోదరులు సంజయ్ లహోటి విషయ సారాంశాన్ని పునరావలోకనం చేసి చెప్పి కార్యక్రమాన్ని ముగించారు.

గత రెండు నెలల నుండి ఈ సెంటర్‌లో ఒక క్రొత్త కార్యక్రమం నిర్వహింపబడుతోంది. నెలలోని మూడవ ఆదివారం నాడు వచ్చిన అభ్యాసీలను పది గుంపులుగా చేసి ఒక్కొక్క గుంపుకూ ఒక పుస్తకం లోని రెండు అధ్యాయాలను చదవమని చెప్పబడుతోంది. భోజన సమయంలో సోదరులు తులసీరాం ఆ అధ్యాయాలకు సంబంధించి పది ప్రశ్నలతో ఒక ప్రశ్నాపత్రాన్ని తయారుచేస్తారు. మధ్యాహ్నం, ఆ ప్రశ్నా పత్రానికి సమాధానాలు వ్రాయడానికి గుంపుల్లోని అందరికీ ఒక గంట సమయం ఇవ్వబడుతుంది. ఆ తరువాత ఆ గ్రూప్‌లోని వారు తమ సమాధానాలను అందరికీ చెప్పడం జరుగుతుంది. అభ్యాసీలందరూ మిషన్ పుస్తకాలను చదవడానికి సహాయపడే ఈ కార్యక్రమం దాదాపు రెండు గంటల పాటు సాగుతుంది.



## ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు



సెప్టెంబర్ పన్నెండవ తేదీన, థానేలోని శుభారంభ్ టవర్స్ లో సాధన పట్ల ఆసక్తి ఉన్న ఇరవైమందికి, భగవంతుణ్ణి బయట కనపడే మూర్తులలో కాకుండా మన హృదయాంతరాళంలో సాక్షాత్కరింపచేసుకోవడాన్ని నొక్కి చెపుతూ, ధ్యానం ద్వారా దీన్ని సాధించడం గురించి చెప్పబడింది. వారిలో అయిదు – ఆరుగురు అనుగుణంగా స్పందించారు.





ఆగస్ట్ పదిహేడున విరుధునగర్‌లోని కామరాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దాదాపు నూటయాభై మంది విద్యార్థులు పాల్గొన్నారు. సోదరులు టి. కె. ఆర్ముగం, బాలసుబ్రమణ్యం ఆ సందర్భంగా మాట్లాడారు. ఆ తరువాత, పద్ధతిపై ఆసక్తి కనపరచిన ప్రధానోపాధ్యాయుణ్ణి అభ్యాసీలు కలిసారు. ఆయన వీలైనంత త్వరగా ఆసక్తి ఉన్న విద్యార్థులకు లాభదాయకంగా, సాధన ఆరంభం చేయడం కోసం కాలేజ్‌లో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేస్తానని చెప్పారు.

**ఝబువా,** సెప్టెంబర్ ఒకటవ తేదీనాడు, ఝబువాలో గత చాలా సంవత్సరాలుగా డజన్ మంది కంటే తక్కువ అభ్యాసీలున్న సెంటర్ వారు, నాలుగు వందలమంది గిరిజన విద్యార్థులు అక్కడే ఉంటూ చదువుకొనే వసతి ఉన్న అక్కడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఒక ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సో॥ ప్రభాకర్ ఆధ్యాత్మిక అవసరాన్ని గురించి, ధ్యానం గురించి విద్యార్థులకు ఉదాహరణలను ఇస్తూ విశదీకరించారు. తొంబైఎనిమిది మంది ఉత్సుకత చూపడంతో, ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న ప్రిఫెక్ట్‌లందరూ ఆ తరువాతి వారం ఝబువా చేరి పరిచయాత్మక సిట్టింగ్‌లు ఇచ్చారు.

నూతన నియామకాలు

సో॥ సురీందర్ శర్మ

జోనల్ ఇన్ చార్జ్ జమ్ము & కాశ్మీర్

## హోసూర్ అభ్యాసి కాలని

### సక్రమంగా అమలుచేయబడిన మంచి ప్రణాళికకు ఒక ఉదాహరణ



ఒక మంచి జీవనానికై అవసరమైన అన్ని హంగులతో అభ్యాసీలు నివాసముండే ఒక కాలని, అలాంటి మిగతా అన్ని కాలనీలకు ఒక నమూనాలాగా నిలుస్తూ త్వరగా తయారవుతోంది. అన్నీ వివరాలతో తయారు చేయబడిన ఆర్థిక ప్రణాళికతోబాటు కలసికట్టుగా పని చేస్తున్న అభ్యాసీలుండడం వల్ల హోసూర్ ఆశ్రమం పక్కనే ఉన్న ప్రదేశంలో ఒక మంచి కాలని తయారయ్యింది.

బెంగళూరుకు తూర్పున కేవలం ఇరవై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హోసూర్, తమిళ నాడు ప్రభుత్వ ప్రోత్సాహం ఉన్న ఒక పారిశ్రామిక కేంద్రం. హోసూర్‌లో ఆశ్రమ నిర్మాణానికి కావలసిన స్థలం వెతికే పని 1995 లోనే మొదలైంది. దాని ఫలితంగానే 2009 లో హోసూర్ బస్‌స్టాండ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో, కేలవారిపల్లి డ్యాం ఎదురుగా కనిపించే అవ లపల్లి గ్రామం దగ్గర స్థలం లభించింది. అప్పుడు జోనల్ ఇన్‌చార్జ్‌గా ఉన్న సో॥ సి. రాజగోపాలన్ ఆ స్థలాన్ని సందర్శించి ముందుకు వెళ్ళడానికి పచ్చజెండా చూపారు.

**వారి ముందు దృష్టి**

కొన్ని సంవత్సరాలముందు, ఒక అభ్యాసీ హోసూర్ ఆశ్రమం కోసం స్థలాన్ని విరాళంగా ఇవ్వాలనుకొన్నప్పుడు, మాస్టర్ సున్నితంగా వారిస్తూ, "హోసూర్‌కు ఎకరాలకొద్దీ స్థలం కావాలి" అని అన్నారు. వారి ఆశీర్వాదంతో, 13.8 ఎకరాల స్థలం సేకరించబడింది. దానిలో 4.75 ఎకరాలు ఆశ్రమంకోసం కేటాయించి, మిగిలిన స్థలాన్ని అభ్యాసీ కాలనీగా చేయడం జరిగింది. మిషన్ సంయుక్త కార్యదర్శి అయిన సో॥ ఎ.పి.

దొరై గారు జనవరి 22, 2010న ఆశ్రమ స్థలాన్ని మిషన్ పేరిట రిజిస్టర్ చేసారు. అక్కడ కలసికట్టుగా జరిగిన పనితో సంతోషపడిన మాస్టర్‌గారు ఆ గృహ సముదాయానికి 'ప్రగతి ఎన్‌క్లేవ్' అన్న పేరును నిర్ధారించారు.

### ప్రధాన కార్యకర్తల బృందం

ప్రాథమిక సదుపాయాలు, చట్టపరమైన విషయాలు, ఆర్థిక విషయాలలో నిర్ణయాలు తీసుకొనేందుకు ఏడుగురు సభ్యులతో ఉన్న ఒక బృందం ఏర్పాటు చేయబడింది. ఈ బృందం, అభ్యాసీలందరినీ సమన్వయపరుస్తూ తగిన చర్చల తరువాత నిర్ణయాలు తీసుకుంది. వారు ఆ భూమి ఖరీదు, అవసరమైన ప్రాథమిక సదుపాయాలు, ఆశ్రమానికై అవసరమైన స్థలం కొనడానికి కావలసిన విరాళం, ఆశ్రమంలో వసతులకు అవసరమైన ఖర్చులు, వచ్చేరోజుల్లో ఆశ్రమ నిర్వహణకు అయ్యే ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ప్లాట్‌ల ఖరీదును నిర్ణయించేందుకు ఒక విధానాన్ని తయారుచేశారు.

### ప్రాథమిక సదుపాయాలు

ఈ కాలనీలో దాదాపు ఇరపై నాలుగు వందల చదరపు అడుగుల వైశాల్యమున్న నూట రెండు ప్లాట్‌లు ఉన్నాయి. ప్రస్తుతం కాంపౌండ్ గోడ, వరదనీరు పోయే కాలువలు, రెండు బోర్‌వెల్‌ల నుండి వచ్చే నీటిని నిలువ చేయడానికి ఒక లక్ష లీటర్ల ఓవర్‌హెడ్ టాంక్, అన్ని ఇళ్ళ స్థలాలకూ నీటి కనెక్షన్‌లు, కాంక్రీట్ రోడ్లు, ప్రస్తుతం ధ్యాన మందిరంగా ఉపయోగింపబడుతున్న కమ్యూనిటీ హాల్, పిల్లలకోసం ఆటస్థలం, అందరూ వాడుకోగల్గిన పార్క్‌లూ ఉన్నాయి. రోడ్ల ప్రక్కన అలంకారం కోసం నాటే చెట్లు, దాదాపు ఏడు వందల వరకూ నాటబడ్డాయి – దీనితో ఆశ్రమం అందంగా తయారయ్యింది. ప్రతి ప్లాట్‌కూ విద్యుత్ కనెక్షన్ ఇవ్వబడింది. ఒక జర్మన్ షెపర్డ్ కుక్క రోజంతా పహరానిస్తోంది. వర్షపు నీటి సేకరణ, సౌర విద్యుద్దీపాలు భవిష్యత్తులో ఏర్పాటు చేసే ప్రణాళిక తయారుగా ఉంది.

### సామూహిక జీవనం

కేవలం మూడు సంవత్సరాల వ్యవధిలోనే పది గృహ నిర్మాణాలు జరిగాయి. ఇంకో రెండు నిర్మాణంలో ఉన్నాయి, ఇంకా కొన్ని ఇళ్ళ నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నది. ఆశ్రమ వాతావరణంలో అభ్యాసీలు ఎంతో ఆనందంగా నివసిస్తున్నారు. సహనాన్ని పెంచుకొని సోదరభావంతో ఒక పెద్ద కుటుంబంలా నివసించడానికి మాస్టర్‌గారు ఇచ్చిన సదవకాశమని అందరూ అర్థం చేసుకొన్నారు. స్వచ్ఛమైన ప్రశాంత వాతావరణం, అందరికీ, అంతర్ముఖులై ఆత్మావలోకనం చేసుకొని, తమను తాము మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతోంది. ఒకసారి ఆశ్రమ ప్రాంగణంలోకి అడుగుపెట్టిన తరువాత వదలి వెళ్ళాలని అనిపించకపోవడం అందరిలోనూ కలుగుతున్న ఒక అనుభూతి. సమతుల్యత ఉన్న సహజ వాతావరణంలో ఆడుతూ పాడుతూ, పరిసరాలను అన్వేషిస్తూ, ఒకరితో ఒకరు సంబంధ బాంధవ్యాలను పెంపొందించుకొంటూ అక్కడి పిల్లలు ఎంతగానో సంతోషంగా ఉన్నారు.



అభ్యాసీల సాయంతోనే కాలానుగుణంగా పెరిగే పచ్చని కూరలు, పప్పు ధాన్యాలు ఆ ఆశ్రమ భూమిలో పెంచుతున్నారు. ప్రతి ఒక్క ఇంట్లోని చిన్న గార్డెన్‌లలో వస్తున్న కూరలు కూడా అందరూ కలసి పంచుకొంటున్నారు. ఇలా నివసించడంలో అందరికీ కనపడుతున్న ముఖ్య లాభం ఏమిటంటే అభ్యాసీలందరూ ఒకే లక్ష్యాన్ని సాధించడంకోసం, ఉన్నతమైన సోదరభావాన్ని పెంపొందించుకోవడం కోసం, పరస్పరం నమ్మకంతో సహనాన్ని అలవరచుకోవడం కోసం జీవనాన్ని సాగించడం. ప్రకృతికి అనుగుణంగా, శుభ్రమైన, ప్రశాంత వాతావరణంలో జీవనం ఆ కాలనీని దర్శించడానికి వచ్చిన అందరినీ ఆహ్వానిస్తోంది.

### ఆశ్రమ నిర్మాణం

పూజ్య గురుదేవులు ఆశ్రమ నిర్మాణానికి అనుమతిని ఇచ్చారు. ఆశ్రమ రూప రచన, ప్రణాళిక తయారై, ప్రస్తుతం ఆమోదం కోసం మిషన్ ముఖ్య కార్యాలయంలో ఉంది. ప్లానులో మెడిటేషన్ హాల్, డార్మిటరీ, భోజనాలయము ఉన్నాయి. ప్రస్తుతం ధ్యానంకోసం ఉపయోగిస్తున్న తాత్కాలిక హాల్‌ను ఇంకో అవసరం కోసం వాడడం జరుగుతుంది. అలాగే తాత్కాలికంగా కిచెన్, ఒక గెస్ట్ రూంలు ఏర్పరచబడ్డాయి. మిగతా సెంటర్లు / ఆశ్రమాలవద్ద కాలనీ తయారు చేయాలన్న ప్రణాళిక ఉన్నవారు ఈ ఆశ్రమాన్ని, కాలనీని సందర్శించి చూస్తే ఎంతగానో లాభపడతారు.







To download or subscribe to this newsletter, please visit http://www.sahajmarg.org/newsletter/india For feedback, suggestions and news articles please send email to in.newsletter@srcm.org

© 2013 Shri Ram Chandra Mission ("SRCM"). All rights reserved. "Shri Ram Chandra Mission", "Sahaj Marg", "SRCM", "Constant Remembrance" and the Mission's Emblem are registered Trademarks of Shri Ram Chandra Mission.This Newsletter is intended exclusively for the members of SRCM. The views expressed in the various articles are provided by various volunteers and are not necessarily those of SRCM.